రైతుల ఖాతాలకు 'బోనస్' కళ

- సన్నరకం వడ్లకు రూ.500 జమ చేస్తున్న సర్కారు
- మద్దతు ధర పొందిన మూడు రోజులకు బోనస్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం (వడ్లు) విక్రయించిన రైతులకు ఖుషీ కబర్. మద్దతు ధర డబ్బులతోపాటు, బోనస్ డబ్బులను ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ మేరకు గత రెండు రోజులనుంచి రైతుల ఖాతాలు నగదు నిల్వతో కళకళలాడుతున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2,320, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిన విషయం విదితమే. వివిధ ధాన్యం కేంద్రాల్లో కొన్ని రోజులుగా రైతులు ధాన్యం విక్రయిస్తున్నారు. వీరికి మొదట మద్దతు ధర, మూడు రోజుల తర్వాత బోనస్ డబ్బులు జమ అయ్యాయి. కల్లూరు మండలంలో 33,400ఎకరాల్లో వరి సాగు చేశారు. 30వేలకు పైగా ఎకరాల్లో సన్నరకం ధాన్యం పండించారు. ఇక దొడ్డురకం ధాన్యం 3వేల ఎకరాల్లో సాగు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం సన్న రకానికి బోనస్‌ను జమ చేస్తున్నదని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కప్పలబంధం గ్రామానికి చెందిన జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన బ్యాంకు ఖాతాలో బోనస్ నగదు జమ అయిందని సంతోషం వ్యక్తం చేశారు. రైతులు ఎక్కువశాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోగా, వారికి బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తోటకూర శేషగిరిరావు,లక్కినేని రమేష్ హర్షంవ్యక్తం చేశారు.

పాల వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పాలశీతలీకరణ కేంద్రాలకు పాల ఉత్పత్తులను సరఫరా చేసేందుకు వాహనదారులు ఈనెల 28 లోగా దరఖాస్తులు అందించాలని ఉమ్మడిజిల్లా విజయ డెయిరీ ఉపసంచాలకుడు మోహనమురళి ఓ ప్రకటనలో కోరారు. ప్రైవేటు రవాణా కాంట్రాక్టర్లు, వాహనాల యజమానులు ఉమ్మడిజిల్లాలోని సత్తుపల్లి, కల్లూరు, కామేపల్లి, ఎర్రుపాలెం, కొత్తగూడెం, ఇల్లెందు నుంచి ఖమ్మం డెయిరీ పరిధిలోని పాల శీతలీకరణ కేంద్రాలకు వివిధ రూట్లలో పాలు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే చల్లబరిచిన పాలు, వెన్న తదితర స్టోర్ వస్తువులు హైదరాబాద్‌కు రవాణ చేయాలన్నారు. దరఖాస్తు ఫారాలను ఖమ్మంలోని రోటరీనగర్ లోని విజయడెయిరీ ఉపసంచాలకుల కార్యాలయంలో ఈనెల 28తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందించాలన్నారు. వివరాలకు 9959895460, 9121160585, 9121160552 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు భద్రాద్రికి మంత్రి పొంగులేటి రాక

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం భద్రాచలానికి రానున్నారు. 11 గంటలకు భద్రాచలం చేరుకుని తొలుత రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం చర్ల రోడ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించనున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు. కరకట్ట నిర్మాణ పనులను సైతం పరిశీలించనున్నారు.

రేపు కమ్మ వన సమారాధన

పెద్దసంఖ్యలో తరలిరావాలి:ఎర్నేని

ఖమ్మం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని వెలుగుమట్ల ఫారెస్ట్ అర్బన్ పార్కులో ఆదివారం నిర్వహించే కమ్మ వన సమారాధనను జయప్రదం చేయాలని కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు కోరారు. శుక్రవారం అర్బన్‌పార్కులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన సమారాధన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆదివారం ఉదయం 9-30 గంటలకు పూజ కార్యక్రమాలతో వనసమారాధన మొదలవుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామీణ క్రీడలు ఉంటాయన్నారు. కమ్మ సోదరులు కుటుంబాలతో సహా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారి కోసం ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి నాగేశ్వరరావు, సైదుబాబు పాల్గొన్నారు.



మహిళా రైతుతో మాట్లాడుతున్న హరీష్‌రావు

రైతులను నట్టేట ముంచారు

- పత్తి, ధాన్యం కొనుగోళ్లలో దక్కని మద్దతు ధర
- ఇంతవరకు ఒక్కరైతుకు కూడా బోనస్ దక్కలేదు..
- రైతుభరోసా ముచ్చటే మర్చిపోయారు..
- 'వరంగల్ డిక్లరేషన్' హామీలన్నీ బూటకమేనా..?
- ప్రజల సమస్యలు పట్టించుకోని ముగ్గురు మంత్రులు
- నెరవేరని హామీలపై ప్రజాప్రతినిధులను నిలదీయండి
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సందర్శన
- రైతులు, మహిళలతో మాటామంతీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

ఖమ్మం మార్కెట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించారు. పత్తి యార్డులో తిరుగుతూ పలువురు రైతులతో, హమాలీలతో, మహిళా కూలీలతో మాట్లాడారు. పత్తికి మద్దతు ధర, రైతు భరోసా, పత్తి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, మహాలక్ష్మి పథకాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. ఆ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌లలో ఒకటైన ఖమ్మం మార్కెట్‌లో మద్దతు ధర దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పత్తి రైతులు క్వింటాలుకు రూ.1500 నష్టపోతున్నారని అన్నారు. అంతేకాకుండా మిర్చి ధరలు సైతం తగ్గుతున్నాయని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా చేతలు మాత్రం (మిగతా 6వ పేజీలో)

రూ. 2,500 వస్తున్నాయా?

మార్కెట్ సందర్శనలో హరీష్‌రావు మహిళా కూలీలతో మాట్లాడారు. 'అమ్మా మీకు మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ. 2,500 వస్తున్నాయా, గ్యాస్ డబ్బులు మీ అకౌంట్‌లో పడుతున్నాయా? బతుకమ్మ చీరల సంగతి ఏమిటి..?' అని అడిగారు. దీంతో మహిళలు తమకు ఎటువంటి పథకాలు రావట్లేదని బదులిచ్చారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మరికొంత మంది రైతులతో మాట్లాడుతూ 'కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలా ఉంది? ఈ ప్రభుత్వ హయాంలో ఎలా ఉంది..?' అని అడిగి తెలుసుకున్నారు. దీంతో కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన రైతు బాసా పుల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌కు అనవసరంగా ఓటేశామని, ఎలాగూ ఒక సంవత్సరం గడిచిపోయింది.. మరో నాలుగేళ్లు ఓపిక పడదామని రైతులందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు.

'ఎనుముల' కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి..

- ఎన్నికల హామీలు ఏమయ్యాయి
- భట్టి గ్యారెంటీ బాండ్ ఎక్కడ?
- ఆ ఇద్దరివి ప్రభుత్వ హత్యలే
- ప్రొద్దుటూరు సమావేశంలో తన్నీరు హరీష్‌రావు

7



త్వరలో ఘనంగా స్తంభాద్రి ఉత్సవాలు

- ఖమ్మం జిల్లా ఘనతను నలుచెరగులా చాటుతాం
- కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధికి కృషి చేశా
- ఇప్పుడు ఎంపీగా కూడా అదే తీరు కొనసాగిస్తా
- బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితం
- రైతులకు బేడీలు వేయించిన సంగతి మర్చిపోయారా?
- కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

ఖమ్మం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించినట్లుగా ఖమ్మం జిల్లా విశిష్టతను రాష్ట్రానికి తెలియచేసేందుకు తిరిగి స్తంభాద్రి ఉత్సవాలను ఘనంగా త్వరలో నిర్వహిస్తామని రాజ్యసభ సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వెల్లడించారు శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆమె జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం జిల్లా ఉత్సవాలను స్తంభాద్రి ఉత్సవాలుగా నామకరణం చేసి నిర్వహించామని, జిల్లాకు చెందిన ప్రముఖులను సత్కరించుకున్నామని అదే స్ఫూర్తితో మళ్లీ ఉత్సవాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. గతంలో తాను ఎంపీగా, కేంద్రమంత్రిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని, స్తంభాద్రి ఉత్సవాల నిర్వహణతోపాటు రైల్వేబ్రిడ్జీలు స్టేషన్లు ఆధునీకరణ, ఖమ్మంఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధస్థూపం పాలేరుతోపాటు కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్ అభివృద్ధికి కృషిచేయడం జరిగిందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో రాజ్యసభ సభ్యురాలిగా, ఖమ్మంజిల్లా ఆడబిడ్డగా ఈ జిల్లా అభివద్ధికి కృషిచేస్తానన్నారు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుకు గతంలో తాను కేంద్రమంత్రిగా ఎంతో కృషిచేశానని, మళ్లీ ఇప్పుడు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మంలో మిర్చి రైతులకు, మామిడి రైతులకు ఉపయోగపడేలా ఇరాడియేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు.

మీ మాటలు ఎవరూ నమ్మరు...

మీ మాటలు ఎవరు నమ్మరు.. మీ పాలనపై విసుగు చెందే కాంగ్రెస్‌ను గెలిపించారని బీఆర్ఎస్ మాజీ మంత్రులు (మిగతా 6వ పేజీలో)

కార్యకర్తలే పార్టీకి బలం

- వారికి ఎల్లవేళలా అండగా ఉంటాం..
- రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి
- ఐదు మండలాల్లో పర్యటన
- పలు కుటుంబాలకు ఓదార్పు, భరోసా

వివరాలు : 7లో



కలెక్టర్ ఇంట్లో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

కలెక్టర్ ఇంట్లో కుటుంబ సర్వే

అరగంట పాటు వివరాలు సేకరించిన ఎన్యుమరేటర్లు 6



కలెక్టరేట్ ఎదుట నిరసన నిద్ర చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హాస్టళ్ల సమస్యలపై నిరసన నిద్ర

- ఏఐఎస్ఎఫ్ ఆందోళన భగ్నం
- ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

6

చెరుకు రైతుకు తీపి కబురు

- మెట్రిక్ టన్నుకు రూ.3400 ధర
- ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.116 ఎక్కువ
- మధుకాన్ షుగర్స్ ఎం.డి. నామా కృష్ణయ్య వెల్లడి

నేలకొండపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వరపురం గల మధుకాన్ షుగర్స్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ సంస్థ 2024-25 క్రషింగ్ సీజన్‌కు చెరుకు మద్దతు ధరను మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.3400 ప్రకటించింది. ఈ మేరకు ఫ్యాక్టరీ ఎండీ నామా కృష్ణయ్య శుక్రవారం వివరాలు వెల్లడించారు. మధుకాన్ ప్రకటించిన మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మెట్రిక్ టన్నుకు రూ.116ఎక్కువన్నారు. 2023-24 సీజన్ కంటే మెట్రిక్ టన్నుకు రూ.210 ఎక్కువన్నారు. మార్కెట్‌లో పంచదారకు ధర లేక పోయినా, ఫ్యాక్టరీ నష్టాల్లో ఉన్నా, రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మద్దతు ధరను ప్రకటించినట్లు కృష్ణయ్య చెప్పారు. అంతేకాకుండా చెరుకు రైతులకు ప్రోత్సాహకాలను సైతం కృష్ణయ్య ప్రకటించారు. ఎకరాకు మూడు మెట్రిక్ టన్నుల చెరుకు విత్తనం ఉచితంగా ఇస్తామన్నారు. అలాగే రైతులు సరఫరా చేసే ప్రతి మెట్రిక్ టన్నుకు పావు కేజీ పంచదార ఉచితంగా ఇవ్వనున్నట్లు (మిగతా 6వ పేజీలో)

డాక్టర్లు వస్తున్నారు

- భద్రాద్రి జిల్లాకు డిసెంబరులో రానున్న 17 మంది వైద్యులు
- తీరనున్న వైద్యుల కొరత

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎట్టకేలకు వైద్యుల కొరత తీరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాకు కొత్తగా 17మంది వైద్యులు డిసెంబరు నెలలో వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 64వైద్యుల పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం 47మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. 17మంది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఏజెన్సీ ప్రాంతంలోని కీలక చోట్ల పూర్తి స్థాయిలో వైద్యం రోగులకు అందని పరిస్థితి ఉంది. ఫలితంగా సీజనల్ సమయంలో విషజ్వరాలు ప్రబలుతున్న సందర్భాలు లేకపోలేదు. ప్రభుత్వం తాజాగా వైద్యుల నియామకానికి తెర తీయటంతో జిల్లాకు కేటాయించిన వైద్యులు వెంటనే డిసెంబరులో బాధ్యతలు చేపడితే (మిగతా 6వ పేజీలో)

పాలేరుకు పర్యాటక సొబగులు

- ప్రకృతి అందాలతో చూపరులను కట్టి పడేసేలా గ్రీనరీ, పూలమొక్కలు
- ఫుల్ ఎంజాయ్ చేసే విధంగా అధునాతన పార్టీ బోట్లు
- చెక్కలు, వెదురు, గడ్డి ఉపయోగించి హట్స్ నిర్మాణం
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- రూ.5 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిన సర్కారు



చెక్కలు, వెదురు, గడ్డితో నిర్మించనున్న ఎకో రిసార్ట్ కాటేజీలు

కూసుమంచి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా స్వాగత ద్వారం, ఆహ్లాదానికి నెలవైన పాలేరు పర్యాటక కేంద్రం కొత్త సొబగులు సంతరించుకోనున్నది. సహజసిద్ధ అందాలతో అనుభూతులు పంచేవిధంగా, వసతులు కల్పించి పర్యాటకులను ఆకర్షించేందుకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.5కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ నిధులతో పార్కుల్లో పచ్చిక బయళ్లు (గ్రీనరీ), పూల మొక్కలు, లైటింగ్ ఏర్పాటు, పార్కుల్లో కట్టే గేజీబోస్ మండపం, సైనేజ్ (సైన్ బోర్డులు), లాహిరి.. లాహిరి అంటూ నీటిపై విహరిస్తూ ఫుల్ ఎంజాయ్ చేసేవిధంగా అత్యాధునిక పార్టీ బోట్లు, జెట్టీలు, స్పీడు బోట్లు, విశ్రాంతి తీసుకునే విధంగా కాటేజీలు, రిసార్టులు, రెస్టారెంట్లు, సమాచార కేంద్రం ఇతరత్రాల ఏర్పాట్లు చేయనున్నారు. ఇప్పటికే తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలో టెండర్లు ఖరారు కానున్నాయి.



పాలేరు జలాశయంలో ఏర్పాటు చేయనున్న లాంచీ

రూ.5కోట్లతో వసతులు

పాలేరు పర్యాటక కేంద్రాన్ని రూ.5కోట్లతో అన్ని వసతులు కల్పించి పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ ఉన్న మూడు పార్కుల్లోనూ గ్రీనరీ పెంచేవిధంగా పచ్చిక బయళ్లు, రకరకాల పూలమొక్కలతో సుందరీకరించనున్నారు. పిల్లల పార్కులో మళ్లీ అధునాతనంగా ఆట వస్తువులు ఏర్పాటు చేయనున్నారు. పాలేరు జలాశయంలో విహరిస్తూ ఎంజాయ్ చేసేవిధంగా అత్యాధునిక బోట్లు ఏర్పాటు చేయనున్నారు. హుస్సేన్‌సాగర్‌లో ఉన్న లాంచీ మాదిరిగా 60 మంది కెపాసిటీతో విహరించేలా పార్టీ బోట్లు, రెండు స్పీడ్‌బోట్లు, కాళ్లతో తొక్కితే కదిలే పెడల్‌బోటు ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులకు వసతి కల్పిస్తూ చెక్కలు, వెదురు, గడ్డి ఉపయోగించి నిర్మించే ఎకో రిసార్ట్ కాటేజీలు 10 నిర్మించనున్నారు. అదేవిధంగా పర్యాటకులకు నచ్చేవిధంగా మధురమైన రుచులతో భోజన వసతికై రెస్టారెంట్లు ఏర్పాటు చేయనున్నారు.

పర్యాటకులకు అవసరమైన సమాచార కేంద్రం, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఉండటం, అదేవిధంగా కూసుమంచిలో కాకతీయుల కాలంనాటి గణపేశ్వరాలయం, జీళ్లచెరువులో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండటంతో పాలేరు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

మత్తు పదార్థాల రవాణాపై

నిఘాను పెంచాలి: ఎస్పీ

- పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టిసారించండి
- అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు




పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులో ఉన్న పోలీసులు ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా కాకుండా సమర్థవంతంగా అరికట్టాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషిచేయాలని, ఏమైనా సందేహాలు తలెత్తితే ఉన్నతాధికారుల సలహాలతో న్యాయాధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. మత్తు పదార్థాలు రవాణా కాకుండా నిఘాను పెంచుకోవాలని, కోడిపందాలు, జూదంలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పనితనాన్ని గురించి తెలుసుకున్నారు. ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. విధుల పరంగా ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నాగరాజు, అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ఎస్‌ఐ యాయాతిరాజు, శివరామకృష్ణ, దమ్మపేట ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి దేవస్థానం వేద పండితులు

గుదిమెళ్లకు భద్రభారతి పురస్కారం

రేపే భద్రాచలంలో అందజేత



భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అథర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు భద్రభారతి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం భద్రాచలంలో జరగనున్న మధుర కవయిత్రి అభినవమొల్ల డా.చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ సంస్మృతి సభను పురస్కరించుకొని పురస్కార గ్రహీత గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులకు పురస్కారాన్ని అందజేయనున్నారు. అలాగే వాల్మీకి శ్రీరామాయణ బాలకాండను సృజనము, బాల కాండము ద్విపద కావ్యాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి ద్వితీయ కుమారులు జంధ్యాల వెంకటరమణ ఆవిష్కరించనున్నారు. అదేవిధంగా డా.చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ సంస్కృతి సేవా ట్రస్టు లోగోను భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు ఆగమరత్న పొడిచేటి రామచంద్రాచార్యులు ఆవిష్కరించనున్నారు. ఈ సభకు ప్రముఖ కవి పండితులు నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి అధ్యక్షత వహించనుండగా ముఖ్యఅతిథిగా దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, గౌరవ అతిథులుగా సాహిత్యాభిమాని తాళ్లూరి పంచాక్షరయ్య పాల్గొననున్నారు.



చలినేస్తాలు వచ్చేశాయ్..



నగరంలో నేపాల్, రాజస్థాన్ ఉన్ని దుస్తుల విక్రయాలు

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతోపాటు తెల్లవారుజామునుంచి ఉదయం ఎనిమిదింటి వరకు పొగమంచు ఆవరిస్తుండటంతో ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. కార్తీకమాసంలోనే చలి తీవ్రంగా ఉండగా రానున్న నెలల్లో మరింత అధికమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శ్వాస కోశ ఇబ్బందులు ఉన్న వారు, అస్తమా తదితర పేషెంట్లు, వృద్ధులు, చిన్నపిల్లలు చలికి తట్టుకోలేక పోతున్నారు. రూం హీటర్లను వాడటం, తెల్లవారుజామునుంచి చలి మంటలు వేసుకుంటున్నా ఉపశమనం అంతంత మాత్రమే కావటంతో ఉన్ని దుస్తులను ధరించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

చలిని తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, శాలువాలు, స్కార్ఫ్‌లు వంటి చలి నిరోధక దుస్తులకు గిరాకీ పెరిగింది. ప్రతీ ఏటా అక్టోబరు మాసంనుంచి నగరంలో ఉన్ని వస్త్రాల విక్రయాలు మొదలవుతుంటాయి. అదే విధంగా నేపాల్, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు చెందిన ఉన్ని వస్త్రాల వ్యాపారులు నగరంలో ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. స్వెట్టర్లు, జర్కిన్లు వివిధ రంగులు, డిజైన్లలో, అందుబాటులో ఉండగా వాటి ధరలు రూ.500 నుంచి ఉన్నాయి.. వీటితో పాటు మంకీ క్యాప్‌లు, మఫ్లర్ల ధరలు రూ.100వరకు ఉన్నాయి. ఒంటికి ధరించే వస్త్రాలతోపాటు చలికి కప్పుకునే రగ్గులు రూ.300 నుంచి 500 వరకు ఉన్నాయి.

మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం



కళాశాల పరిస్థితిని వివరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాల్వంచలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం శుక్రవారం సందర్శించింది. న్యాక్ బృందం పర్యటన సందర్భంలో ఐటీడీఏ పీవో రాహుల్ అక్కడకు చేరుకుని కళాశాల పరిస్థితిని బృందం సభ్యులకు వివరించారు. కళాశాలలో విద్యార్థినులకు సకల సౌకర్యాలతో విద్యాబోధన చేస్తూ వారు పై చదువులు చదవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వారికి వివరించారు. విద్యార్థినులకు అందిస్తున్న మెనూ, నిష్ణాతులైన ఫ్యాకల్టీతో విద్యాబోధన, ల్యాబోరేటరీ సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ, సమయానుకూలంగా ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు, విశాలమైన ఆటస్థలం, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను రాహుల్ వారికి వివరించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా కళాశాలలో అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, న్యాక్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపికైన సమ్మక్క



దమ్మపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దమ్మపేటకు చెందిన బోగి సమ్మక్క ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. సివిల్ కానిస్టేబుల్, గ్రూప్-4లో జీసీసీలో జూనియర్ అసిస్టెంట్‌తోపాటు జూనియర్ లెక్చరర్‌గా ఇంగ్లీష్‌కు ఎంపికైంది. తను మూడు ఉద్యోగాలకు ఎంపిక అవటం పట్ల సంతోషం వ్యక్తం చేసింది. సమ్మక్క తల్లి రమణ అంగన్‌వాడీ టీచర్‌గా దమ్మపేటలో పనిచేస్తుండగా తండ్రి బోగి సత్యం జీసీసీలో హమాలిగా పనిచేస్తున్నాడు. సమ్మక్క మాత్రం సివిల్స్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తోంది. ఒక్క ఉద్యోగాన్ని దక్కించుకునేందుకు నిరుద్యోగులు కుస్తీలు పడుతుండగా సమ్మక్క మాత్రం ఒకే దఫా మూడు ఉద్యోగాలకు ఎంపిక కావటం పట్ల దమ్మపేటకు చెందిన పలువురు అభినందించారు.

రేపు మైసూరులో

రామయ్య కల్యాణం

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో ఆదివారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు భద్రాచలం దేవస్థానానికి చెందిన శ్రీరామరథం శుక్రవారం మైసూరు తరలివెళ్లింది. అక్కడ స్వామి వారి కల్యాణం నిర్వహించిన అనంతరం తిరిగి రానున్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్య శుక్రవారం స్వర్ణ కవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా స్వామివారికి నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

రామయ్యను దర్శించుకున్న డ్రగ్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్



భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామిని రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ రాజవర్ధనచారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సమయంలో ఆయన ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతో పాటు దాసాంజనేయస్వామి వారి ఆలయం, లక్ష్మీతాయారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ జిల్లా అధికారి సంపత్‌కుమార్, పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

30న టీటీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30, డిసెంబరు 1 తేదీల్లో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలతో పాటు ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలలో 11 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి డిసెంబరులో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 25కల్లా తమ ఎంట్రీలను పంపాలని, ఇతర సమాచారం కోసం 9848408335 నెంబరును సంప్రదించాలని కోరారు.

రైతులను నట్టేట ముంచారు...

(5వ పేజీ తరువాయి)

గడప దాటడం లేదన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులకు సహాయం, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, రైతులకు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని మాయమాటలు చెప్పారని, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. ధరలు పడిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. 'మంత్రులు ఒకమాట చెబుతారు, అధికారులు మరోమాట చెబుతున్నారు.. రాష్ట్రంలో అధికంగా ధాన్యం పండింది, అంతా మేమే కొంటామని చెబుతూ తక్కువ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.. ఖమ్మం జిల్లాలో 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే కేవలం 19వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఒక్క రైతుకు కూడా బోనస్ రూపాయి రాలేదు..' అని దుయ్యబట్టారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని, పైచేయి సాధించేందుకు ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారన్నారని విమర్శించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 దక్కేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నాయకులు కొండబాల కోటేశ్వరరావు, గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాటామంతీ..

ఖమ్మం మార్కెట్‌లో పత్తి అమ్మేందుకు వచ్చిన రైతులతో హరీశ్‌రావు మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతుబంధు వచ్చిందా? ఎందుకు ఇంకా రాలేదు? పత్తికి బోనస్ ఇచ్చారా? ఎందుకు ఇవ్వట్లేదంటూ మీ ప్రజా ప్రతినిధులను నిలదీయండి..' అని కోరారు. 'ఎకరాకు ఎంత పెట్టుబడి అయింది, పంట పైసలు ఎన్ని చేతికి వచ్చాయి, రుణమాఫీ అయిందా?' అని అడుగుతూ ముందుకు సాగారు. హమాలీలతో, మహిళా కూలీలతో సైతం మాట్లాడారు. ఈ సందర్భంగా రామన్నపేటకు చెందిన ఒక హమాలీ మాట్లాడుతూ ఇటీవల ఖమ్మంలో వచ్చిన మున్నేరు వరద వల్ల తన ఇల్లు మునిగిపోయిందని, ఇంతవరకు ప్రభుత్వం నుంచి వరద సాయం రాలేదని గోడు వెళ్లబోసుకోగా, న్యాయం జరిగేలా చూస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

చెరుకు రైతుకుతీపి కబురు

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. మహారాష్ట్ర, జహీరాబాద్ నుంచి కొత్త చెరుకు వంగడాలను తెచ్చి నాటుకునే రైతులకు రవాణా రాయితీగా ఎకరాకు రూ.1800 ఇవ్వనున్నట్టు చెప్పారు. చెరుకు నాటే యంత్రాలు, బోదెలు వేసే యంత్రాలు, బోదెలు ఎగదోసే యంత్రాలు సరఫరా చేసి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, చెరుకును లాభసాటిగా మారుస్తున్నామన్నారు. రుద్రూరు, బసంత్‌పూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల నుంచి ప్రతి మూడు నెలల కొకసారి శాస్త్రవేత్తలను పిలిపించి రైతులకు అవసరమైన, సలహాలు, సూచనలు ఇప్పిస్తున్నామన్నారు.

డాక్టర్లు వస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

రోగులకు ఉపశమనం లభించే అవకాశాలు ఉన్నాయి.

తీరనున్న వైద్యుల కొరత

24గంటల పీహెచ్‌సీల పరిధిలో ఉండాల్సిన ఇరువురు వైద్యులలో ఒకరు మాత్రమే ఉంటున్న పరిస్థితి ఉందని దీంతో రోగులకు పూర్తిస్థాయి వైద్యం అందించే సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా సీజనల్ వ్యాధుల సమయంలో క్యాంపులు నిర్వహించాలన్నా మరో వైద్యుడు అందుబాటులో లేకపోవటంతో అవి నిర్వహించలేని పరిస్థితి ఉందని సమాచారం. ఇదిలా ఉండగా జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావటంతో రోగులకు మెరుగైన సేవలు అందించాలంటే అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఇద్దరేసి వైద్యుల నియామకం చేపట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటే ఒకరు పీహెచ్‌సీలో ఓపీ చూస్తే మరొకరు పీహెచ్‌సీ పరిధిలో క్యాంపులు నిర్వహించేందుకు వెసులుబాటు లభిస్తుందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.



సర్వే ఫారంపై సంతకం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కలెక్టర్ ఇంట్లో కుటుంబ సర్వే

- అరగంట పాటు వివరాలు సేకరించిన ఎన్యుమరేటర్లు

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నివాసంలో వివరాలు సేకరించారు. కలెక్టర్ స్వయంగా తన కుటుంబ, ఆస్తుల వివరాలను తెలియజేశారు. నగరంలోని క్యాంపు కార్యాలయానికి ఒక స్పెషల్ ఆఫీసర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఎన్యుమరేటర్లు వెళ్లి కలెక్టర్‌ను కలుసుకొని సర్వే నిర్వహించారు. సర్వేకు మొత్తం అర్ధగంట సమయం పట్టింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 75.15 శాతం మేర సర్వే పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో హౌస్ లిస్టింగ్ చేసిన మొత్తం 5 లక్షల 67 వేల 338 ఇళ్లను సర్వే కోసం గుర్తించామని, నవంబర్ 21 నాటికి 4129 ఎన్యుమరేటర్ బ్లాక్ పరిధిలో మొత్తం 4 లక్షల 26 వేల 333 ఇళ్లను సర్వే చేసినట్లు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 54.96 శాతం, పాలేరులో 80.93 శాతం, మధిరలో 80.66 శాతం, వైరా లో 88.54 శాతం, సత్తుపల్లిలో 88.54 శాతం, జిల్లా వ్యాప్తంగా 75.15 శాతం సర్వే పూర్తయిందన్నారు.

హాస్టళ్ల సమస్యలపై నిరసన నిద్ర

- ఏఐఎస్ఎఫ్ ఆందోళనను భగ్నం చేసిన పోలీసులు
- ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత
- నరక కూపాలుగా మారిన హాస్టళ్లు: ఇటికాల రామకృష్ణ



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖమ్మం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరసన నిద్ర కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంక్షేమ వసతి గృహాలు అవినీతికి నిలయంగా మారాయని, జిల్లాకు చెందిన మంత్రులు, వసతి గృహాల పర్యవేక్షణ చేసే డిప్యూటీ డైరెక్టర్లు పట్టించుకోవటం లేదని, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం రాత్రి కలెక్టరేట్ ఎదుట నిరసన నిద్రకు ఉపక్రమించారు. సమాచారం అందుకున్న పోలీసులు నిద్రకు ఉపక్రమించిన నేతలను అదుపులోకి తీసుకొని, వారిని అక్కడనుంచి తొలగించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు అసౌకర్యాలుండి నరకకూపాన్ని తలపిస్తున్నాయన్నారు.సంక్షేమ వసతిగృహ నిర్వహణ గాడి తప్పి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. చలికాలం సమీపించినా 15 రోజులు కావస్తున్నా విద్యార్థులకు దుప్పట్లు అందించలేదని, జిల్లావ్యాప్తంగా అనేక హస్టళ్లలో కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు భయాందోళనలతో ఉన్నారన్నారు. ఇప్పటికైనా హాస్టళ్లను డీడీలు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు షేక్‌నాగుల్‌మీరా, మధు, శివనాయక్, మనోజ్, జిల్లానాయకులు హరికృష్ణ, ప్రతాప్, బాలాజీ, సుభాష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మధిరలో ప్రజాపాలన విజయోత్సవం

- డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్సీల రాక

మధిర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న మధిర మండలం దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాలులో పెద్ద ఎత్తున ప్రజాపాలన విజయోత్సవం నిర్వహించనున్నారు. ఈ ప్రజాపాలన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పలువురుప్రజాప్రతినిధులు పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జయ జయహే ప్రజాపాలన అనే కళాబృందం అలేఖ్య సారధ్యంలో మధిర ప్రాంతానికి విచ్చేసి వివిధ కళారూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళాప్రదర్శనలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

త్వరలో ఘనంగా

స్తంభాద్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న రేణుకాచౌదరి

(5వ పేజీ తరువాయి)

తన్నీరు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి పంటకు గిట్టుబాటు ధర కావాలని రైతుల అడిగితే వారికి సంకెళ్లు వేసి అరెస్టుచేసి తీసుకెళ్లిన మీకు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గత పదేళ్ల పాలనలో రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏంచేసిందో రైతులందరికీ తెలుసని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదికాకముందే ఈ ప్రభుత్వంపై అనేక విమర్శలు చేస్తున్నారని, మీ పాలనలో గుట్టలు, కొండలు ఆక్రమణలు చేశారని, ప్రజలను పట్టించుకోలేదని, అందువల్లే గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పారని పేర్కొన్నారు. ఏడాది కాకముందే మళ్లీ ప్రజల వద్దకు వచ్చి కల్లబొల్లి మాటలు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



భూమి మీద అత్యంత వేగంగా, మెరక నేలల్లో పెరిగే కలప వృక్షాలలో వెదురు ఒకటి. 120రోజుల్లో 3సెం.మీ వ్యాసం, 40మీ ఎత్తు పెరుగుతుంది. భారతదేశంలో 23 జాతులకు చెందిన 136 రకాలైన దేశాయ, విదేశీ వెదురు రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇది ఆకురాల్చు, సతత హరిత మొక్కగా ప్రసిద్ధి చెందింది. వెదురు ఒక లీటరు నీటిని తీసుకొని 6.6 గ్రాముల కలపను ఇస్తుంది. వెదురు సాగు, లాభాలు, రకాల గురించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యాన విభాగం హెడ్ ఐవీఎస్ రెడ్డి వివరించారు.

వెదురుతో అదిరే లాభాలు

- స్థానిక భూములు సాగుకు అనుకూలం
- మెరక భూముల్లో, వేగంగా వ్యాప్తి చెందే లాభయదాయక పంట

అశ్వారావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూమి మీద అత్యంత వేగంగా, మెరక నేలల్లో పెరిగే కలప వృక్షాలలో వెదురు ఒకటి. 120రోజుల్లో 3సెం.మీ వ్యాసం, 40మీ ఎత్తు పెరుగుతుంది. భారతదేశంలో 23 జాతులకు చెందిన 136 రకాలైన దేశాయ, విదేశీ వెదురు రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇది ఆకురాల్చు, సతత హరిత మొక్కగా ప్రసిద్ధి చెందింది. వెదురు ఒక లీటరు నీటిని తీసుకొని 6.6 గ్రాముల కలపను ఇస్తుంది. వెదురు సాగు, లాభాలు, రకాల గురించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యాన విభాగం హెడ్ ఐవీఎస్ రెడ్డి వివరించారు.

వెదురులో రకాలు...

డెండ్రోకెలామస్ స్ట్రిక్టస్, బంబూస అరుండినేరియా, బంబూస బాల్కోవ(భీమా వెదురు), డెన్డ్రోకాలమస్ స్టాక్స్, డెన్డ్రోకాలమస్ హోమిల్లోని, బంబూస టులా, డెన్రోన్డకాలమస్ ఆస్పర్ రకాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

100 ఏళ్లకు పైనే..

వెదురు కొరకు పెంచే రకాల్లో ఒక్కో రకాన్ని బట్టి 7-120 సంవత్సరాలకు ఒకసారి పుష్పించిన తరువాత చెట్టు చనిపోతుంది. ఒక ప్రదేశంలో జన్మించిన విత్తనాన్ని ఏ ప్రదేశంలో నాటిన దాని పుష్పించే విధానంలో మాత్రం మార్పు ఉండదు. వెదురు నవంబరు నుంచి మార్చి నెల వరకు పుష్పించి విత్తనాలు ఏప్రిల్, మే నెలల్లో పక్వానికి వస్తాయి. తొలకరిలో విత్తనాలను నారుమడిలో పోసుకొని వీటిని 47 సెం.మీ. సంచులలో జనవరిలో నాటాలి. అధిక వర్షపాతం గల నెలలో (జూన్ చివరికి) మొలకెత్తుతుంది. సాధారణంగా 5-10 రోజులలోపు మొలకెత్తుతుంది. సాధారణంగా పాలిథిన్ సంచుల్లో విత్తనాలు నాటినప్పుడు మొలక శాతం ఎక్కువగా ఉంటుంది.

సాగు ఖర్చులు.. దిగుబడి..

ఒక ఎకరాలో 1000 మొక్కల చొప్పున నాటుకోవడానికి మొక్కలు, ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ వసతి, కూలీల ఖర్చులన్ని కలుపుకొని మొదటి సంవత్సరం రూ.97,650లు ఖర్చు అవుతుంది. ఆ తరువాత ప్రతి సంవత్సరం ఎరువులు, పురుగు మందులు, కూలీలు వంటి ఖర్చులన్ని కలిపి రూ.72,055లు వరకు ఖర్చు అవుతుంది. 3 సంవత్సరముల తరువాత మంచి దిగుబడి ఇస్తుంది. ప్రిసేషన్ ఫార్మింగ్ ద్వారా 3వ సంవత్సరము నుంచి సంవత్సరానికి ఒక్కొక్క మొక్క నుంచి 6 బొంగుల చొప్పున ఎకరాకు 6000 బొంగులు, సరాసరి ఒక్కొక్క బొంగు బరువు 8 కిలోల చొప్పున ఎకరాకు 48 టన్నుల దిగుబడి వస్తుంది. సరాసరి ఒక్కో టన్ను విలువ రూ.6000ల చొప్పున ఎకరాకు రూ.2,88,000 ఆదాయం లభిస్తుంది. మూడవ సంవత్సరం నుంచి ఖర్చులు పోను రూ.2,15,945 వరకు నికరాదాయం పొందవచ్చును.



వెదురు మొక్కలు



ఐవీఎస్ రెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యాన విభాగం హెడ్
అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల

ప్రభుత్వ రాయితీలు

జాతీయ వెదురు మిషన్, రాష్ట్రీయ వెదురు మిషన్‌ల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలు వెదురు సాగు కోసం పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ప్రభుత్వ/ ప్రభుత్వ రంగ సంస్థల/ గ్రామ కంఠం భూముల్లో గట్లపై (బౌండరీ ప్లాంటేషన్) పెంచడానికి 100 శాతం రాయితీ లభిస్తుంది. మొదటి సంవత్సరం రూ.15,600లు, రెండ సంవత్సరం రూ.9,360లు, మూడవ సంవత్సరం రూ.6240లు రాయితీలు లభిస్తుంది. ప్రతి రైతుకు గల భూమిలో సాగు చేసిన వెదురు విస్తీర్ణం ఆధారంగా ఒక రైతుకు గరిష్ఠంగా 2 హెక్టార్ల వరకు రాయితీ ఇస్తారు. మొక్కకు మొక్కకు మధ్య దూరం 5మీటర్లు ఎకరానికి 160 మొక్కలు(హైడెన్సిటీ ప్లాంటేషన్) ఎకరానికి సాగుబడి ఖర్చు రూ.40,000. దీనిని మూడు సంవత్సరాలకు 50:30:20 నిష్పత్తిలో 50% విడుదల చేస్తారు. రూ.20,000 ఎకరానికి మొదటి సంవత్సరం, రూ.10,000 రెండవ సంవత్సరం, రూ.6000 మూడవ సంవత్సరం రూ. 4000. లభిస్తుంది. పొలం గట్లపై పెంచుటకు ఎకరానికి 130 మొక్కలకు రాయితీ 50శాతం లభిస్తుంది.

ఎనుముల కాదు, ఎగవేతల రేవంత్‌రెడ్డి..

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీ‌ష్‌రావు
- చింతకాని మండలంలో రైతు కుటుంబాలకు పరామర్శ



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న హరీ‌ష్‌రావు

చింతకాని, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తగా పెళ్లైన ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం 6 లక్షల తులాల బంగారం బాకీ పడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ‌ష్‌రావు అన్నారు. శుక్రవారం చింతకాని మండల పరిధిలోని పొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో ఆయన ఇటీవల పర్యటించారు. ప్రొద్దుటూరు గ్రామంలో భూమి కోసం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఓ కేసులో అక్రమంగా అరెస్టయిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లచ్చగూడెం గ్రామంలో విద్యుత్‌షాక్ తో మృతిచెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు.

ఈ సందర్భంగా ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మార్పు రావాలని ప్రచారం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏమి మార్పు వచ్చిందని ప్రశ్నించారు. రైతులందరూ కేసీఆర్ ప్రభుత్వమే బాగుందని మళ్లీ ఆయనే రావాలంటున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల హామీల్లో భాగంగా 6 గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చాడని ఆ బాండ్ పేపర్ సంగతేంటన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల పాలన పూర్తైందని, మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు మహిళలకు ఇస్తామన్న రూ 2500 ప్రకారం ఇప్పటి వరకు రూ 25500 బాకీ ఉందని, ఆడబిడ్డలకు పెండ్లి సందర్భంగా లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని అమలు చేయలేదని, ఇప్పటి వరకు రాష్ట్రంలో 6 లక్షల పెళ్లిల్లు అయ్యాయని వారికి ఇవ్వాల్సిన 6 లక్షల తులాల బంగారం కూడా బాకీ పడిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి ఎనుముల కాదని.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏమి ఒరిగిందన్నారు. ముఖ్యమంత్రి టీవీల్లో మాట్లాడేపుడు పిల్లలకు చూపించొద్దన్నారు. ఆయన మాటలు అన్ని అబద్దాలే అని ఐతే తిట్లు లేకపోతే ఒట్లు అన్నారు.

రైతులవి ప్రభుత్వ హత్యలే

పొద్దుటూరు రైతు బోజడ్ల ప్రభాకర్, లచ్చగూడెం రైతు గూని ప్రసాద్ ఇద్దరివి ప్రభుత్వ హత్యలేనని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు రైతులు మృతిచెందారన్నారు. ఉపముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇద్దరు రైతులు చనిపోతే వారి కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని పోరాడిన పెంట్యాల పుల్లయ్యపై అక్రమ కేసులు బనాయించడం నేరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టిన పోలీసులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతమధు, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బొమ్మెర రాంమూర్తి, రాకేష్‌రెడ్డి, పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, బండి రామారావు, బొడ్డు వెంకటరామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బిల్లుల వాగ్వాదం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదలకు ప్రభుత్వం విడుదల చేసిన ఫ్లడ్ రిలీఫ్ ఫండ్స్ ఖమ్మం నగర పాలక సంస్థలో ఇటు అధికారులకు ఆటు కాంట్రాక్టర్ల మధ్య పంచాయితీ తెచ్చి పెట్టాయి.

వారం క్రితం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మున్నేరు పరివాహక ప్రాంత ఫ్లడ్ రిలీఫ్ నిధులు రూ.2.75 కోట్లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కేఎంసీ ఇంజనీరింగ్ అధికారుల ఖాతాలకు జమ చేశారు. వాటిలో రూ.2 కోట్లు పారిశుధ్య పనులు, మున్నేరు వరదల్లో నష్టపోయిన రహదారులు, వంతెనలకు కేటాయించాలని, మిగిలిన రూ.75 లక్షలు పునరావాస కేంద్రంలోని భోజనాల బిల్లులకు చెల్లించాలని అధికారులు ప్రతిపాదించిన విషయం బయటపడింది. దీంతో కాంట్రాక్టర్లు శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిశారు. ముందుగా తమ బిల్లులకు ఫ్లడ్ రిలీఫ్ డబ్బులు కేటాయించాలని కోరారు. దీంతో ఈఈని కలిసి మాట్లాడుకోవాలని కమిషనర్ చెప్పటంతో సాయంత్రం కాంట్రాక్టర్లు కేఎంసీలో సమావేశమయ్యారు. కమిషనర్ చాంబర్ నుంచి బయటకు వస్తున్న ఈఈ కృష్ణలాల్‌ను అడ్డగించారు. ముందుగా తమ బిల్లులను చెల్లించి తర్వాత ఇతర పనులకు నిధులు కేటాయించుకొని శంకుస్థాపనలు చేసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కేఎంసీలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా బిల్లులు చెల్లింపు విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇవ్వటంతో వివాదం సద్దుమణిగింది.

నిధులు మళ్లింపు కారణం

మున్నేరు ఫ్లడ్ రిలీఫ్‌కు మంజూరు జరిగిన నిధుల్లో రూ.40 లక్షలు ఖమ్మంలోని వీధి దీపాల కొనుగోలుకు కేటాయించారు. పదో డివిజన్‌లో సీసీ రహదారి మరమ్మతులకు రూ.10 లక్షలు, 11వ డివిజన్‌లో సీసీ రహదారికి రూ.5లక్షలు, 16వ డివిజన్‌లో సీసీ రహదారికి రూ.2లక్షలు, 17వ డివిజన్‌లో సీసీ రహదారికి రూ.5లక్షలు కేటాయించారు. దీంతో వివాదం ఏర్పడింది.



ఈఈని ప్రశ్నిస్తున్న కాంట్రాక్టర్లు

వెదురు ఉత్పత్తుల్లో నూతన పోకడలు

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చండ్రుగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బెండాలపాడలో స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వెదురు ఉత్పత్తుల పరిశ్రమ నుంచి కొత్త తరహా ఉత్పత్తులు తయారు చేసేందుకు కృషి జరుగుతున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. శుక్రవారం బెండాలపాడు శివారులోని వెదురు ఉత్పత్తుల పరిశ్రమను ఐటీడీఏ, స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంప్రాదాయ ఉత్పత్తులే కాకుండా నూతన పద్ధతుల్లో కొత్త ఉత్పత్తుల తయారీపై అధికారులు, ఉత్పత్తిదారులతో చర్చించారు. ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని, అందుకు ప్రభుత్వం సహకారం ఉంటుందని నిర్వాహకులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.కనకగిరి గుట్టలను అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పులిగుండాల ప్రాజెక్టును కలుపుకొని కనకగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే, దూర ప్రాంతాల్లోని పాపికొండులు లాంటి పర్యాటక కేంద్రాకు వెళ్లకుండా ఇక్కడే పర్యటించ వచ్చన్నారు. టూరిజం పనులపైనా చర్చి జరిగిందని, డిసెంబరులో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ జేడీఎం హరికృష్ణ, తహశీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, భోజ్యానాయక్, ఏడుకొండలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి





సిలువ రాజు, నాగేశ్వరరావు మృతదేహాలు

సుజాతనగర్/ కొణిజర్ల/ పాల్వంచ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు చోట్ల ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాలను ఢీకొని, మరో చోట ద్విచక్ర వాహనం తగిలి మొత్తం ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు.

జూలూరుపాడు మండలం మాచినేని పేట గ్రామానికి చెందిన లకావత్ నాగేశ్వరరావు (35) తన భార్య నిర్మలతో కలిసి తన ద్విచక్రవాహనంపై సింగభూపాలెం వెళ్లి జూలూరుపాడు తిరిగి వస్తున్నారు. సుజాతనగర్ మండలం నాయకుల గూడెం గ్రామం వద్దకు రాగానే ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న లకావత్ నాగేశ్వరరావు(35) అక్కడికక్కడే మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది.

వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన కటికల సిలువరాజు(38), కటికల శోభన్‌బాబు ఇద్దరు అన్నదమ్ములు. తమ్ములు సిలువరాజు ద్విచక్రవాహనం నడుపుతుండగా అన్న శోభన్‌బాబు వెనుక కూర్చొని ఖమ్మం పెయింటింగ్ పనికి వెళుతున్నారు. మధ్యలో పల్లిపాడు సమీపంలో ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న కొత్తగూడెం డిపో ఆర్టీసీ హైర్ బస్సు ఓవర్‌టేక్ చేస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిలువరాజు తలకు తీవ్రగాయాలతో అక్కడకక్కడే మృతి చెందాడు. శోభన్‌బాబుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు 108 వాహనంలో ఖమ్మం తరలించారు.

పాల్వంచ మండల పరిధిలోని కేశవాపురానికి చెందిన మాలోతు లక్ష్మణ్(40) మార్బుల్స్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో అదే గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళుతుండగా అకస్మాత్తుగా రోడ్డుపై ద్విచక్రవాహనం వచ్చి అతి వేగంగా ఢీకొట్టింది. దీంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా ద్విచక్రవాహనం నడుపుతున్న రాహుల్‌గాంధీ నగర్‌కు చెందిన రెహమాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

వివాహిత మృతి

ముదిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో జారిపడి వివాహిత మృతిచెందిన సంఘటన న్యూలక్ష్మీపురం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఖమ్మం రూరల్ మండలం గుడిమళ్ల గ్రామానికి చెందిన గోనె అనూష(29) న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు వచ్చింది. సాయంత్రం మంచినీళ్లు తాగేందుకు బావి దగ్గరకు వెళ్లగా ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడి మృతిచెందింది. తోటి కూలీలు మృతదేహాన్ని బయటకు తీశారు.

పాడి గేదెల మృత్యువాత

చింతకాని, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన బొందుల సత్యనారాయణకు చెందిన రెండు పాడి గేదెలు విద్యుత్ షాక్ గురై మృత్యువాత పడ్డాయి. రైతు తన పాడి గేదెలను మున్నేరు పరివాహకు ప్రాంతానికి మేతకు తోలుకెళ్లాడు. నీళ్ల త్రాగేందుకు మున్నేరు నీళ్లలోకి వెళ్లగా మున్నేరులో ఉన్న రైతుల వ్యవసాయ మోటార్లకు బిగించిన విద్యుత్ తీగలకు కరెంటు ప్రసారం కావడంతో గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ లక్షన్నర వరకు ఉంటుందని రైతు తెలిపారు.



ఖమ్మం రూరల్ మండలంలో కన్నేటి కుటుంబాన్ని ఓదార్చుతున్న రేణుకా చౌదరి



కూసుమంచిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

- రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి
- పలు కుటుంబాలకు ఓదార్పు

కామేపల్లి/ ఖమ్మం రూరల్/ రఘునాథపాలెం/ కారేపల్లి/ కూసుమంచి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలమని రాజ్యసభ సభ్యురాలు ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. శుక్రవారం పలువురిని పరామర్శించడానికి జిల్లాలో పర్యటించారు. కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెంలో గ్రామంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లమోతు లక్ష్మయ్య ఇంటి వద్ద కొద్దిసేపు ఆగారు. కార్యకర్తల వల్లనే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. వారికి ఎల్లవుడు అండగా ఉంటామని అన్నారు. పాలేరు నియోజకవర్గ మాజీ బీ బ్లాక్ అధ్యక్షుడు కన్నేటి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో రేణుకా చౌదరి రూరల్ మండల పరిధిలోని మంగళగూడెం గ్రామంలోని కన్నేటి వెంకన్న ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకన్న సతీమని వెంకటమ్మ, కుమారులు అనీల్, దినేష్, సోదరుడు కన్నేటి నరసింహరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నేటి జ్యోతిలను పరామర్శించారు.

ఇటీవల వరదల్లో కొట్టుకుపోయిన కారేపల్లి మండల పరిధిలోని గంగారాంతండకు చెందిన మోతీలాల్, అతడి కుమార్తె అశ్వని కుటుంబాన్ని ఎంపీ పరామర్శించారు. గుండె శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తమ్మిని నాగేశ్వరరావు ను పరామర్శించేందుకు రేణుకాచౌదరి శుక్రవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తికి వెళ్లారు.

ఈ సందర్భంగా స్థానికులు గణేశ్వరం నుంచి దోనబండ వరకు వెళ్లే రహదారికి అటవీశాఖ అనుమతి ఇవ్వటం లేదని సంబంధిత అధికారులతో మాట్లాడాలని వినతిపత్రం అందించారు. చింతగుర్తిలో కమ్యూనిటీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలకు నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు. ఇటీవల మరణించిన కార్పొరేటర్ మలీదు జగన్, కుటుంబ సభ్యులను రేణుకాచౌదరి పరామర్శించారు.

ద్విభాషా పుస్తకాలు ఎంతో ఉపయుక్తం

- ఎస్ఈఆర్‌టీ పరిశీలకుడు వెంకట ముత్తయ్య

జూలూరుపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ద్విభాషా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని ఎస్ఈఆర్‌టీ డైట్ పరిశీలకుడు జి.వెంకటముత్తయ్య అన్నారు. శుక్రవారం జూలూరుపాడులోని పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ద్విభాషా పాఠ్యపుస్తకాల వినియోగంపై ప్రశ్నావళిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వేరువేరుగా అందించి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ద్విభాషా పాఠ్యపుస్తకాలు ఏ మేరకు విద్యార్థులు అవగాహన చేసుకుంటున్నారు, ఆంగ్ల పదజాలం నేర్చుకోవడానికి ఎంతమేరకు దోహదం చేస్తున్నాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విభాషా పాఠ్యపుస్తకాల ద్వారా అర్థంకాని ఆంగ్లంలో ఉన్న విషయాలను పక్క పేజీలోని తెలుగులో తెలుసుకోవడం సులభతరమవుతుందన్నారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాలో శుక్రవారం నుంచి 3 రోజుల పాటు 10 బృందాలు పాఠశాలలను సందర్శిస్తామని వెంకటముత్తయ్య తెలిపారు.



జూలూరుపాడులో విద్యార్థుల రాస్తున్న పరీక్షను పరిశీలిస్తున్న వెంకట ముత్తయ్య

వందశాతం ఫలితాలు వచ్చేలా కృషిచేయాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్



వీడియో కాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహిస్తున్న ఐటీడీఏ పీవో, అధికారులు

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో పని చేస్తున్న హెచ్‌ఎం, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు, సబ్జెక్టు టీచర్లు కలిసికట్టుగా పనిచేసి పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కాన్ఫరెన్సు హాల్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వార్డెన్, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు సబ్జెక్టు టీచర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాఠశాలల నిర్వహణపై ఆయన ప్రత్యేక సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రత్యేక సూచనలు, ఆదేశాల మేరకు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు మెనూ ప్రకారం తాజా కూరగాయలతో సమయానుకూలంగా వారికి భోజన సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులు కొన్ని చోట్ల హెచ్‌ఎం, వార్డెన్ల అనుమతి లేకుండా వెళుతున్నట్లు, మరికొన్ని చోట్ల 50 శాతం పిల్లల హాజరు శాతం లేదని మా దృష్టికి వచ్చిందని ఇటువంటి పరిణామాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఇకపై టీచర్లకు డిప్యూటేషన్లు కోరుకున్న చోట బదిలీలు ఉండవని ఈ నాలుగు నెలలు పిల్లల చదువుపై దృష్టిపెట్టాలని అన్నారు. డిసెంబరు మొదటి వారంలో ఐటీడీఏ యూనిట్ అధికారులు పాఠశాలలపై మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, జీసీసీ డీఎం సమ్మయ్య, ఏసీఎంవో రమణయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు22(ఆంధ్రజ్యోతి):ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించేలా సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ట్రాన్స్ జెండర్లతో సమీక్షించారు.ట్రాన్స్ జెండర్లకు ఆధార్ కార్డు జారీ, పేరు మార్పు విధానం, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్, నూతన స్వయంసహాయక సంఘాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ప్రభుత్వం నుండి ఏలాంటి పెన్షన్ పథకం లేదని, ఒంటరి మహిళల కోటా క్రింద పెన్షన్ మంజూరుకు దరఖాస్తులు అందచేస్తే, మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్ జెండర్లకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	44 రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	30
కాకరకాయ	34
బెండకాయ	34
పొట్లకాయ	40
దోసకాయ	34-50
చిక్కుడు	70
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	38
దొండ	30-38
సొరకాయ	28
క్యారెట్	64
క్యాప్సికం	58
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవకీనందన వాసుదేవ
సినీ గెలాక్సీ:	జీబ్రా

క్రికెట్ టోర్నీలో ఖమ్మం అమ్మాయిల సత్తా



ట్రోఫీని అందుకుంటున్న కెప్టెన్ గ్రీష్మ

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఎమ్మెస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అండర్-15 బాలికల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి క్రికెట్ టోర్నీలో ఖమ్మం క్రీడాకారిణులు సత్తా చాటారు. తెలంగాణా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారిలో ముగ్గురు జిల్లా క్రీడాకారులు ఉండటం గమనార్హం. జట్టు కెప్టెన్‌గా, కీపర్ కమ్ బ్యాట్స్‌ఉమెన్‌గా ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామానికి చెందిన తోటమల్ల గ్రీష్మ, ఖమ్మానికి చెందిన బౌలర్‌లుగా బాణోత్ యమున, గౌరీమంజలి అత్యంత ప్రతిభ చూపి జట్టును విజయ తీరాలకు చేర్చారు.

యాంటీబయాటిక్‌ల వినియోగం అనర్థం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన డాక్టర్లు సూచించిన మేరకు మాత్రమే యాంటిబయాటిక్ మందులను వినియోగించాలని లేకుంటే అనర్థదాయకమని జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరారవు, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కె కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబయాల్స్ రెసిస్టెన్స్ అవగాహన కార్యక్రమాన్ని గురువారం మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. మెడికల్ విద్యార్థులకు పోస్టర్, రోల్‌ప్లే, స్కిట్లు, సదస్సును నిర్వహించారు. బాలికలకు రంగోలీ పోటీలను నిర్వహించారు. బహుమతులను ప్రిన్సిపాల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సరిత, సృజన, మైక్రోబయాలజీ అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, సమతారాణి, ప్రీతి, ఆర్‌ఎంవో రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మిజిమ్మిల్‌ఖాన్

ఖమ్మంరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితిల్లో వస్తున్న మార్పు నేపధ్యంలో హాస్టళ్లల్లో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మండల పరిధిలోని జలగంనగర్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యూకేషన్ సొసైటీని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యాల ఆవరణ, లోపల పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. తరగతుల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు అందించారా, భోజనం, తాగునీరు వంటి వివరాలను తెలుసుకున్నారు. ఆహారం రుచిగా, శుభ్రంగా ఉంటుందా వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యాలయంలోని టాయిలెట్స్, హాస్టల్ ప్రాంగణాలను పరిశీలించారు.పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టోర్స్ లోని సరుకులు, కూరగాయాలను పరిశీలించారు. తాజా సరుకులు, పరిశుభ్ర కూరగాయలతో భోజనం అందించాలన్నారు. నిల్వచేసిన భోజనం అందించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులను గమనిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే అవసరమైన చికిత్స అందజేయాలన్నారు. జింకల తండా వద్ద నిర్మించే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌లో శాశ్వత సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రస్తుతం అత్యవసర వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. పిల్లలకు వాటర్ హీటర్ ఏర్పాటు చేయాలని సంబందింత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు జావేద్ పాషా, ఇందిర, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో

తిరుమలాయపాలెం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మితే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఏవో నారెడ్డి సీతారాం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాకరవాయి,జూపెడ,రాజారం, పైనంపల్లి గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలని, ఇష్టానుసారంగా అమ్మితే చర్యలు తీసుకుటామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బాలకృష్ణ, నవనీత పాల్గొన్నారు.

శిశుమరణాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలి

డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి):మాతృమరణాలను నిరోధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతీ భాయి ఆదేశించారు. కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి గురువారం అధికారులతో సమీక్షించారు. మాతృ మరణాలు జరగటానికి కారణాలను విశ్లేషించారు. గర్భిణులకు ప్రతీ క్షణం ముఖ్యమైనది దానికి తగ్గట్లు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండి వారికి అందించాల్సిన చికిత్సలు అందించాలాన్నారు. జిల్లాలో ఆరు మరణాలు సంభవించగా వాటిలో సుబ్లేడు, మామిళ్ళగూడెం, వైరా, కల్లూరు, ముస్తఫానగర్, ఎం వి పాలెం పీహెచ్‌సీల పరిధిలో కేసులను సమీక్షించారు ఈ సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్, ఎంసీహెచ్ పీవో సైదులు, డాక్టర్ చందు నాయక్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్, డాక్టర్లు యామిని, రెహానాబేగం, డెమో సాంబశివరెడ్డి, డీఎస్వో దుర్గ పాల్గొన్నారు.

మూడు శాఖలు సమన్వయంతో పని చేయాలి

- » డిసెంబరు 10నాటికి పారిశుధ్య కార్యచరణ అమలు జరపాలి
- » కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- » ఇంజనీరింగ్,పారిశుధ్య, టౌన్ ప్లానింగ్,అధికారులకు హెచ్చరిక



ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు22(ఆంధ్రజ్యోతి): విభాగాల మధ్య సమన్వయం లేకపోవటంతో కనీసం పారిశుధ్య పనులు ముందుకు వెళ్లటం లేదని, డిసెంబరు10నాటికి ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వాహణ కార్యచరణ ప్రకటించి అమలు చేయాలని కమిషనర్ అభిషేక్‌అగస్త్య ఆదేశించారు. శుక్రవారం కేఎంసీలో ఇంజనీరింగ్, పారిశుధ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షించారు. డ్రెయినేజీలపై ఉన్న అక్రమ కట్టడాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించాలని, భవనాలు, ఇతర నిర్మాణాల కారణంగా డ్రెయిన్లల్లో పడిన నిర్మాణ వ్యర్థాలపై సంబందిత యజమానులకు జరిమానా విధించాలని ఆదేశించారు. నగరంలో కల్వర్టులు, కాల్వలు మరమ్మతులకు గురైతే వాటి నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. డిసెంబరు10నాటికి నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యచరణ చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య జవాన్లు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పనితీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షపి ఉల్లా, ఈఈ కృష్ణలాల్, డీసీపీ వసుంధర, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పనితీరుకు ప్రామాణికం లాటరీనా!

కేఎంసీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుకు ప్రాంతాలు కేటాయింపుపై మల్లగుల్లాలు



ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పనితీరు ఆధారంగా వారు ఏ ప్రాంతంలో సమర్థంగా పనిచేస్తారని అధికారులు అంచనాలు వేసి వారికి ఆయా ప్రాంతాల్లో విధులు కేటాయిస్తారు.. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో పనితీరు కంటే లాటరీ విధానానికే అధికారులు మెగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 20 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ముగ్గురు ఆర్‌ఐలు డివిజన్ల కేటాయింపు చేసుకొని బిల్ కలెక్టర్లుతో రెవెన్యూ వసూళ్లు చేస్తున్నారు. తాజాగా మరో ఇద్దరు ఆర్‌ఐలను కమిషనర్ అభిషేక్‌అగస్త్య నియామకం చేశారు. దీంతో రెవెన్యూ డివిజన్ల విభజన చేయాల్సి వచ్చింది. పనితీరు ఆధారంగా ప్రాంతాలను కేటాయించాల్సిన అధికారులు లాటరీ ద్వారా ప్రాంతాలను ఎంపిక చేసేందుకు కసరత్తులు ప్రారంభించినట్లు సమాచారం.లాటరీ విధానం సరైంది కాదని కొంతమంది ఆర్‌ఐలు వ్యతిరేకించటంతో డివిజన్ల కేటాయింపు వాయిదా పడినట్లు తెలుస్తోంది.

సుబ్లేడు మాజీసర్పంచ్ సంజీవయ్యకు తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామ మాజీ సర్పంచ్ పోలెపొంగు సంజీవ గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామం వెళుతున్నాడు. ఈక్రమంలో పిండిప్రోలు వద్దకు రాగానే లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాదు తరలించారు.

18 నుంచి డీఈఐఈడీపరీక్షలు

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు22(ఆంధ్రజ్యోతి): డీఈఐఈడీలో 2023-25 విద్యాసంవత్సరం విద్యార్థులకు, ఒక్కసారి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు డిసెంబరు 18 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. పరీక్షలు ఉదయం9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బదిలీల్లో అక్రమాలు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు22 (ఆంధ్రజ్యోతి):ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో అనేక అక్రమాలు జరిగాయని, ఫిర్యాదు చేసిన వాటిపై చర్యలు తీసుకోవటంలో డీఈవో జాప్యం చేస్తున్నారని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ పేర్కొంది. పెండింగ్ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, విజయ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించినసమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మనోహర్‌రాజు, ముత్తయ్య, వెంకగశరావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్‌పై ఆంగ్ల ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని శాంతనగర్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ప్రారంభించారు. జిల్లాలోని 17 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాన్ బాస్కో, జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చండీ యాగాన్ని జయప్రదం చేయండి

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు22(ఆంధ్రజ్యోతి): రేపటినుంచి నుంచి 29వరకు ఎస్‌బీఐటీ కాలేజీ రోడ్‌లో జరగనున్న సహస్ర చండీ యాగాన్ని జయప్రదం చేయాలని యాగ నిర్వాహకులు దండ్యాల లక్ష్మణ రావు, గుర్రం మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చండీ యాగాలు తెలంగాణలో ఇప్పటి వరకు కేవలం రెండు సార్లు మాత్రమే జరుగగా ఖమ్మం జిల్లాలో ఇదే మొదటి సారి అని చెప్పారు. సకల శుభాలు కలిగించే చండీ యాగంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పద్మనాయక వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ 2025ను మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు ఆవిష్కరించారు. శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆయన మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాగి వెంకటేశ్వరరావు, గుమ్మడపు మురళీధర్‌రావు, పుసిరికపల్లి రమేష్‌రావు,పైడిమర్రి వెంకటేశ్వరరావు, చెలికాని హనుమంతరావు, చింతల సురేందర్, శెట్టిపల్లి శ్రీనివాసరావు, కోటగిరి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

1న మాలల సింహగర్జన

తిరుమలాయపాలెం,నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ డిసెంబరు 1న హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి గుమ్మడి కనకరాజు పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దాసరి శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, పప్పుల ప్రసాద్, మహేందర్, పప్పుల ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఖమ్మంస్పోర్ట్స్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీడేను పురస్కరించుకొని 11 ఎన్‌సీసీ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 60 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు నవీన్‌యాదవ్, ఓంకార్, రాజారాం, భద్ర, కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాల అనుమతులు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీల పరిధిలో నూతన భవన నిర్మాణాలకు అనుమతులను జారీ చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. లేఅవుట్ అనుమతుల జారీ వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆమె సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామపంచాయతీల పనితీరుపై ఆమె సమీక్షించారు. జిల్లాలో గ్రామ పంచాయతీల విధులు పక్కాగా జరిగేలా చూడాలన్నారు. పంచాయతీలలో నిర్దేశిత లక్ష్యం మేరకు నూరుశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో ఉండే సెల్ టవర్ల నుంచి ఫీజు సకాలంలో వసూలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ పట్ల చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

రేపు పేద కళాకారులకు చీరల పంపిణీ

» ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని



మాట్లాడుతున్న నాగబత్తిని రవి

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు22 (ఆంధ్రజ్యోతి): నాగబత్తిని మాలతి సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నాటక రంగ పేదకళాకారులకు చీరలను పంపిణీ చేస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి అన్నారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం కళాపరిషత్ కార్యదర్శి వి.విజేత, నెలనెల వెన్నెల నిర్వాహకులు ఎ.ఎస్ కుమార్, మోటమర్రిజగన్మోహనరావు,ప్రజానాట్యమండలి రాష్ట్ర,జిల్లా బాధ్యులు కె.దేవేంద్ర, వి.సదానంద్‌తోకలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కళలు, సాహిత్యం, తదితర రంగాలకు మాలతి ఎంతో సేవలందించారన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా రెండేళ్లుగా పేదలకు చీరలను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా నాటక రంగంలో కృషి చేసిన వారికి జీవలన సాఫల్య పురస్కారం అందజేస్తామన్నారు. నెలనెల వెన్నెల కార్యక్రమంలో భాగంగా 24న సాయంత్రం చిగురు మేఘం నాటిక ప్రదర్శించబడుతుందన్నారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్నారు.

ఎల్ఆర్‌ఎస్‌పై దరఖాస్తుదారుల స్పందన ఎలా ఉంది?

» మేయర్ పునుకొల్లు నీరజ



సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై దరఖాస్తుదారులు స్పందన ఏలా ఉంది... రోజుకు ఎంత మంది ఫోన్లు చేస్తున్నారు. అంటూ ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ ఆరా తీశారు. కేఎంసీలో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ కేంద్రాన్ని శుక్రవారం మేయర్ పునుకొల్లు నీరజ తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి ఎల్‌ఆర్‌ఎస్ వివరాలను సేకరించారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులకు వివరించాలని సూచించారు. నిత్యం ఎంత మంది నేరుగా వస్తున్నారని, ఫోన్‌లో ఎంతమంది సమాచారం అడుగుతున్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాల సడలింపులను తెలుసుకొని దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు.

మినీ స్టేడియం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలి: డీవైఎఫ్ఐ

ఖమ్మంరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలో మినీ స్టేడియం, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్. బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో మాట్లాడారు. రూరల్ మండలం, పెద్దమండలం కావున జనాభా లక్షపైన ఉన్నప్పటికీ సౌకర్యాలు మాత్రం శూన్యమన్నారు. మండలంలో మినీ స్టేడియం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మండలంలో వేలాదిమంది పిల్లలు ఉన్నప్పటికి గ్రంథాలయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పోటీపరీక్షల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జక్కంపూడి కృష్ణ, కార్యదర్శి మురళి, నరేష్, నరేష్ రెడ్డి, అనీష్, ప్రవీణ్, రామారావు, భాస్కర్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

నూతన విధానాలతో అధిక దిగుబడి

శాస్త్రవేత్తలు డాక్టర్ రాకేష్, కృష్ణచైతన్య

నేలకొండపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించవచ్చని రుద్రూరు శాస్త్రవేత్తలు రాకేష్, కృష్ణచైతన్య చెరుకు రైతులకు సూచించారు. శుక్రవారం మధుకాన్ షుగర్స్ పరిధిలోని అనంతనగర్, జక్కేపల్లి గ్రామాల్లోని చెరుకు పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. దూరపు సాళ్ల పద్దతిలో చెరుకు నాటటం వలన దిగుబడులు పెరుగుతాయన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనల పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్తలు నాగేందర్, సాయిచరణ్ సైతం తోటలను సందర్శించిన వారిలో ఉన్నారు.



చెరుకు తోటను సందర్శించిన శాసతివేత్తలు

ప్రమాదకరంగా సాగర్ బ్రిడ్జి

- పూర్తిగా ధ్వంసమైన రక్షణ గోడలు
- మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికుల వినతి



బ్రిడ్జికి రెండు వైపుల రక్షణ గోడలు లేని దృశ్యం

కొణిజర్ల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగర్‌కాల్వలపై ఉన్న బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. కాల్వలపై ఉన్న రక్షణ గోడలు కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రక్షణ గోడలు లేకపోవడంతో కాల్వలో పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

కొణిజర్ల మండలం తనికెళ్ల నుంచి బోడియాతండా మీదుగా గణేశ్వరం, చింతగుర్తి గ్రామాలకు వెళ్లే రహదారి తనికెళ్ల-బోడియాతండా మధ్య ప్రధానకాల్వపై బ్రిడ్జి ఉంది. ఆయా గ్రామాల ప్రజలు ఆ బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సి ఉంది. బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికి ఇరువైపుల రక్షణకవచంగా ఉడాల్సిన గోడలు కూలిపోయాయి. అటునుంచి వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. నిత్యం వెళ్లే స్థానికులకు కొంత అటువాటు అయినప్పటికీ కొత్తవారు వెళ్లితే అర్థం కాక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఆయా గ్రామాల ప్రజలు బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే భయపడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ బ్రిడ్జిని నిర్మించి 40ఏళ్లగా పైగానే అవుతుందని స్థానికులు తెలుపుతున్నారు. దీంతో బ్రిడ్జి మధ్యలో కూడా బ్రిడ్జిపై సువ్వలు కనిపిస్తున్నాయి. ఇటీవల చింతగుర్తి నుంచి ట్రాక్టర్‌తో వస్తున్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదపుశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి కాల్వలో పడి ప్రాణాలను కోల్పోయారు. గతంలో ఇదే బ్రిడ్జి వద్ద రెండు, మూడు సంఘటలు చోటు చేసుకున్నాయని, అయితే అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. బ్రిడ్జీ చుట్టు కూడ పిచ్చిమొక్కలు పెరగడం, కోతకు గురికావడం ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. ప్రాణాలుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిపై రక్షణ గోడలు నిర్మించి, కాల్వకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి
జరపల వెంకన్న, బోడియాతండ



నిత్యం రద్దీగా ఉండే రహదారి. కాల్వపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికు రక్షణగోడలు లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తుంది. రాత్రిపూట గ్రామానికి వెళ్లాలంటేనే భయం వేస్తుంది. అధికారులు పట్టించుకోని మరమ్మతులు చేపట్టాలి.

ప్రమాదాలు జరగకుండా చూడాలి
వాంకుడోతు నరేష్, బోడియాతండ



సాగర్‌బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఇటీవల బ్రిడ్జిపై నుంచి కాల్వలో పడి ఇద్దరు మృతిచెందారు. ప్రతి రోజు ఆ బ్రిడ్జిపై నుంచి ప్రయాణించడం భయం వేస్తుంది. వెంటనే బ్రిడ్జికి రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

బీటీ రోడ్డు మంజూరు చేయాలని వినతి

కొణిజర్ల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లి నుంచి కొణిజర్ల వరకు బీటీ రోడ్డు కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి మాజీ జడ్పీటీసీ దొండపాటి రమేష్, తుమ్మలపల్లి గ్రామస్థులు కట్ల సత్యం, గడల శ్రీనివాసరావు, కమతం నాగేశ్వరరావులు వినతిపత్రం అందజేశారు. తుమ్మలపల్లి నుంచి కొణిజర్ల రహదారి అధ్వానంగా ఉందని, తుమ్మలపల్లి గ్రామంలో సీసీరోడ్లు మంజురూ చేయాలని వినతిపత్రం ద్వారా వివరించారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

మధిరరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని దెందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ హేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపట్నం యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, ఇంటర్నెట్‌కు ఎడిట్ కా వడం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ ఐశ్వర్య, హెచ్ఎం డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

24న జేవీఆర్‌లో కార్తీక దీపోత్సవం

సత్తుపల్లి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆదివారం కార్తీక దీపోత్సవం సందర్భంగా వేద పండితులచే శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

కొణిజర్ల, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన బయ్యపు నాగమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. వైద్యఖర్చుల నిమిత్తం రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ మేరకు మంజూరైన రూ.2.50 లక్షల చెక్కును శుక్రవారం బాధితురాలి కుటుంబానికి గ్రామానికి చెందిన ఊటుకూరి రంజిత్ ఆధ్వర్యంలో అందజేశారు. నాగమణి ఇబ్బందులు గురించి రంజిత్ పొంగులేటి క్యాప్ ఆఫీస్ ఇన్‌చార్జీ దయాకర్‌రెడ్డి వివరించగా మంత్రి సహకారంతో ఎల్‌వోసీ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధితురాలికి అందజేసిన్నట్లు రంజిత్ తెలిపాడు. కాంగ్రెస్ నాయకులు దొడ్డబాబు, సత్యం, కొండలు, చిరంజీవి, సుధాకర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు: ఆర్డీవో

వేంసూరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెవాడ, వెంకటాపురం, అమ్మపాలెం తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కల్గించొద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎంఏ.రాజు, ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, సీఈవోలు పెంకి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, గోపి పాల్గొన్నారు.

కొర్రీలు పెట్టకుండా పత్తిని కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి

తల్లాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన పత్తిని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన పత్తిలో తేమశాతం ఎక్కువ ఉందని తిరస్కరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐనాల రామలింగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్ పాల్గొన్నారు.

'విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొదించుకోవాలి'

కొణిజర్ల, నవంబరు22: ఫార్మసీ కోర్సుకు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదవాలని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక బ్రౌన్స్ కళాశాల నందు ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగాంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మసీ కోర్సుకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రణాళికతో విద్యను అభ్యసించాలని సూచించారు. నైపుణ్యాలను పెంపొదించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ జగన్నాథ్‌పాత్రో, కళాశాల పరిపాలనాధికారి హనుమంతరావు తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

వైరా, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వైరా మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశం శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, గౌరవాధ్యక్షులుగా వరికూటి సురేష్‌బాబు(గరికపాడు), చిట్టిపోతుల వెంకటేశ్వరరావు(గన్నవరం), ఉపాధ్యక్షులుగా వేమా పురుషోత్తంరావు(లింగన్నపాలెం), కోట సునీత(గొల్లపూడి), ప్రధాన కార్యదర్శిగా కర్నాటి హేమలత(దాచాపురం), కోశాధికారిగా ఉబ్బాన లక్ష్మణ్‌రావు(వల్లాపురం), సభ్యులుగా ఆర్.భారతీ, జూ పూడి అజయ్‌కుమార్, కె.నిర్మల, చిన్న వెంకట్రావమ్మ, రవీంద్రయాదవ్, భవాని, వి.అనూష, హెచ్‌వీ.ప్రసాదరావు, సీహెచ్.నాగేశ్వరరావు, ఎం.కృష్ణయ్య, అరుణ, శ్రీలతలను ఎన్నుకున్నారు.

భూసారంపై రైతులకు అవగాహన కార్యక్రమం

వైరా, నవంబరు22(ఆంధ్రజ్యోతి): భూమిలో కార్బన్ శాతాన్ని పెంచడం ద్వారా పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఏవో మయాన్ మంజూఖాన్ తెలిపారు. మండలంలోని అష్టగుర్తి గ్రామంలో శుక్రవారం భూమిలో కార్బన్ శాతాన్ని పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాల్లో వరిదుబ్బు కాల్చటం వలన భూమిలో ఉన్న కార్బన్ శాతం తగ్గి, భూమి సారవంతాన్ని కోల్పోతుందని వివరించారు. దీనివలన భూమి గుల్లబారుతుందని అందువలన వరిదుబ్బులను భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సారవంతం పెరుగుతుందని తెలిపారు. ఏఈవో వాసంతి, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులకు డేటా ఎంట్రీ బాధ్యతను కేటాయించొద్దు'

కొణిజర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డేటా ఎంట్రీ బాధ్యతను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఇవ్వొద్దని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డా వరప్రసాద్, షేక్ కరామత్‌అలీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 15రోజుల నుంచి ప్రతి రోజు ఒక్కపూట బడులు మాత్రమే అభ్యసన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని డేటా ఎంట్రీ బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించవద్దని కోరారు. దీంతో విద్యార్థులకు సిలబస్ పూర్తికాకుండా ఇబ్బంది కలుగుతుందని వాపోయారు.

సమగ్ర సర్వేను వేగవంతంగా పూర్తి చేయండి

- ఆర్డీవో నర్సింహారావు



ఎర్రుపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు

బోనకల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వే ఈ నెల 24 నాటికి పూర్తయ్యేలా కృషి చేయాలని ఆర్డీవో నర్సిహారావు ఆదేశించారు. మండలంలోని రావినూతల గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుల గణన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 85 శాతం సర్వే పూర్తైనందున మరో రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బోర్డర్ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం తనిఖీ కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్ ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

మధిరరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు క్రాస్‌రోడ్డువద్దగల సరిహద్దు పీపీసీ చెక్‌పోస్టును శుక్రవారం ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు సందర్శించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ చెక్‌పోస్టు మీదుగా పక్క రాష్ట్రం గుండా ఎటువంటి ధాన్యం, పత్తి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రాయపట్నం గ్రామంలో రిటైల్ అవుట్‌లెట్ కోసం ప్రతిపాదించిన భూమిని ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, సర్వేయర్ ఉష సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రుపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబసర్వేను ఆర్డీవో జి.నర్సింహారావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భగా తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో సర్వే 85శాతం పూర్తైందని, తెలిపారు. వెంకటాపురం గ్రామానికి కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని ఏఈవోలు ఆర్డీవోని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మన్నె ఉషాశారద, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, ఏపీఎం బి.వెంకటేశ్వర్లు ఏఎస్‌వో జానిమహ్మద్, ఏఈవోలు బాలకృష్ణ, దుర్గాప్రసన్న తదితరులున్నారు.

రాగి జావతోనే పౌష్టికాహారం

- వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీనజ్యోతి

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాగి జావతోనే పౌష్టికాహారం లభిస్తుందని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఉచిత రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల సిబ్బంది విరాళాలతో నేటి నుంచి విద్యార్థినులకు ప్రతిరోజూ రాగిజావ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఫైల్స్ వితరణ

బోనకల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబీరవల్లి పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు జల్లా సత్యనారాయణ, శ్రీదేవిలు యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన టీచర్స్‌కు ఫైల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో దామాల పుల్లయ్య మాట్లాడుతూ సర్వీసులోకి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు అంకితబావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, సదాబాబు, పీ.వీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

24న యాదవ సంఘం వన సమారాధన

ముదిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈనెల 24వతేదీన యాదవసంఘం ఆధ్వర్యంలో జరిగే వనసమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిగొండలో జరిగిన సమావేశంలో వనసమారాధనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలోని కొత్తగూడెం రోడ్డులో ఉన్న చెరుకూరి మామిడితోటలో ఈ వనసమారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కురమ యాదవులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమమంలో చిలకల వెంకటనర్సయ్య, చిత్తారు సింహాద్రియాదవ్, వాకదాని కోటేశ్వరరావు, తెల్లబోయిన రమణ, పొదిల సతీష్, కాసు మల్లేష్, వాకదాని కన్నయ్య, కొట్టే శ్రీనివాసరావు, బట్టు బసవయ్య, చిలకల రామకృష్ణ, మీగడ శ్రీనివాసరావు, ధనియాకుల సాయి, నాగేశ్వరరావు, నాగరాజు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సువర్ణాపురంలో భూమి పరిశీలన

ముదిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సువర్ణాపురం గ్రామంలో ఓభూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం వెంచర్ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోగా అట్టి భూమిని శుక్రవారం డీఆర్‌వో రాజేశ్వరి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్ఐ వహీదా పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

- వైద్యాధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం



వైద్యాధికారుడిని ప్రశ్నిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

తల్లాడ, నవంబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు పంపిణీ ఆన్‌లైన్ రిజిస్టర్ నమోదులో నిరక్ష్యం పట్ల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఎంహెచ్‌వో కళావతిబాయిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రం, హోమియో వైద్యశాల, జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆమె సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టు సెలవులో ఉన్న కారణంగా మందుల పంపిణీ వివరాలను ఆన్‌లైన్ రికార్డు నమోదు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫార్మాసిస్టు సెలవులో ఉన్నప్పుడు ఇన్‌చార్జ్ బాధ్యతలను వేరే వారికి ఎందుకు అప్పగించలేదని డాక్టర్ రత్నమనోహర్‌ను ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు గురించి రైతులను అడిగి తెలుసుకోగా గన్నీసంచుల కొరత ఉందని వారు చెప్పడంతో గన్నీసంచుల కొరత నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.వనజ, ఎంపీడీవో ఎం.చంద్రమౌళి, ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, సొసైటీ సీఈవో నాగబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత

కల్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో శుక్రవారం ఆర్టీసీ తరుపున దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ వైద్యుడు వేము గంగరాజు దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేతలో ఆర్థికంగా చేయూత నిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, గంగరాజు తల్లిదండ్రులు వేము ఇసాక్, రత్తమ్మ, కిన్నెర ఆనందరావు, కంచి సాంసన్, వేమిరెడ్డి జానారెడ్డి, హరికృష్ణ, నరిసింహా, దాసు తదితరులు పాల్గొన్నారు.

వెన్నవల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్లూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండంలోని వెన్నవల్లి గ్రామంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఎం వెంకటారామారావు, కొండపల్లి శ్రీమన్నారాయణ, బాబురావు, గుమ్మ శ్రీను, ఊడల శ్రీను, లక్ష్మీదేవి, మల్లేశ్వరీ, వెంకటమ్మ, కరుణ గ్రామదీపిక షాహనాజ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

కారేపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు పరిశీలించారు. సీసీ చైతన్య, సుజాత, కృష్ణవేణి, ఐఈవో మున్ని రైతులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కల్లూరు క్రీడాకారిణి లాస్య ఎంపిక



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని శాంతినగర్ కు చెందిన క్రీడాకారిణి మాతిపోగు లాస్య జాతీయ స్థాయిలో డిసెం బరు 6 నుంచి 10 తేదీ వరకు జరగనున్న ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైంది. భారతదేశ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా వారి ఆధ్వర్యంలో అండర్-17 బాలికల విభాగంలో నిర్వహించ నున్న ఈ పోటీలకు కల్లూరు నుంచి లాస్య తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ప్రస్తుతం ఈ బాలిక హకీంపేట క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ క్రీడాపోటీల్లో తన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా లాస్యకు కల్లూరులోని శాంతినగర్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు ఆర్టీసీ ఆనంద్ తమవంతుగా రవాణా చార్జీల నిమిత్తం ఆర్థిక చేయూత నిచ్చారు. ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆదర్శ్‌కుమార్, స్పోర్ట్స్ స్కూల్ స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్‌బోస్, వ్యాయామ ఉపాధ్యాయుడు వీరరాఘవయ్య, గ్రామస్థులు లాస్యను అభినందించారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



యోగా చేస్తున్న వైద్యసిబ్బంది

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో యోగా శిక్షణ తరగతులను వైద్యాధికారి రాకేష్ శుక్రవారం ప్రారంభించారు. ఆయూష్ డిపార్టు మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా నియమించబడిన యోగా శిక్షకు రాలు పైళ్ల పద్మావతి ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సునీత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముదిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. యోగా శిక్షకుడు వెంకటేష్ యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణాదేవి సిబ్బంది ఉన్నారు.

'చెరకు రైతుల సదస్సును జయప్రదం చేయండి'

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముట్టాపురంలో శనివారం జరిగే చెరకు రైతు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు రైతుసంఘం జాతీయ అధ్యక్షుడు రవీంద్రన్, రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లెంపాటి రామారావు, బాణాల శ్రీనివాసరావు, చెరకు రైతులు కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, నర్వనేని యుగంధర్ పాల్గొన్నారు.

దీక్షదారులకు ట్రాన్స్ కమ్యూనిటీ భిక్ష

సత్తుపల్లిరూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): సహాయానికి తాము సైతం అంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించే ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అయిన మాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప, హనుమ మాలధరించిన దీక్షాదారులకు మాతా ఫౌండేషన్ (ట్రాన్స్ కమ్యూనిటీ) శుక్రవారం భిక్ష ఏర్పాటు చేసింది. పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని తమ నివాసంలో భక్తులకు భోజనం వడ్డించినట్లు నిర్వహకులు చిత్రమ్మ, స్పందన, అను, రచనలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లకు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బారులు తీరిన పత్తి వాహనాలు

కారేపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి శుక్రవారం పరిసర ప్రాంతాల నుంచి రైతులు పత్తిని విక్రయించేందుకు భారీగా తీసుకువచ్చారు. అయితే అధికారులు కేవలం 40నుంచి50వాహనాలకు సంబందించిన వాహనాలను మాత్రమే తేమశాతాన్ని పరిశీలించి బండ్లకు పాసింగ్ ఇస్తున్నారు. దీంతో అనేక వాహనాలు జిన్నింగ్ మిల్లు పరిసర ప్రాంతాల్లో నిలిచిపోయాయి. రోజుకు 40వాహనాలకు మాత్రం తేమశాతాన్ని పరిశీలించి అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు విషయాన్ని గమనించాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.



ఇల్లెందు రోడ్డుపై నిలిచి ఉన్న పత్తి లోడింగ్ వాహనాలు

జిల్లాస్థాయి టాలెంట్ టెస్టుకు మహదేవపురం విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధిరరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈనెల 28వతేదీన జరుగనున్న జిల్లాస్థాయి చెకుముఖి టాలెంట్ టెస్టుకు మధిర మండలం మహదేవపురం హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆపాఠశాల హెచ్ఎం సాధుసమాధానం తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో మండలస్థాయిలో జిల్లాస్థాయికి ఎంపికైన సంధ్యారాణి, కీర్తి, త్రివేణి అనే విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సుధాకర్, వినోదరావు, కృష్ణవేణి, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం

తల్లాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలోని రామాలయంలో శుక్రవారం అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకుడు మణికంఠశర్మ, గురుస్వామి కొమ్మినేని రాంబాబు ఆధ్వర్యంలో 30మంది మాలధారులకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

పలు కుటుంబాలకు రామనాథం పరామర్శ

బోనకల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో అనారోగ్య బాధిత కుటుంబాలను శుక్రవారం టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు పారా కోటయ్యను పరామర్శించారు. మాజీ సర్పంచ్ పారా సుబ్బయ్యను కలిసి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త రసూల్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, మరీదు బరకయ్య, తాళ్లూరి కోటేశ్వరరావు, పిచ్చయ్య, సాంబయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.